క్లుప్తంగా

ఆర్డీఓను కలిసిన పీఏసీఎస్ చైర్మన్



భూపాలపల్లి రూరల్: ఇటీవల బదిలీపై వచ్చిన భూపాలపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్డీఓ) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రమాదేవిని భూపాలపల్లి పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అర్బన్ నాయకులు నలిగేటి సతీష్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ చోరీ

మహదేవపూర్: విద్యుత్ తీగ చోరీకి గురైన సంఘటన మండలంలోని ఎడపల్లి శివారులో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎడపల్లి గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి కరెంట్ పోలును విరగకొట్టి దాదాపు రూ.20,000 విలువ వైరును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఏఈ శ్రీకాంత్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో



కాటారం: కాటారం మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. కళాశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినులు కళాశాలకు రావడం లేదని పేర్కొన్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిశోర్, తరుణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు, జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి ఆదేశాల మేరకు మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీని మండల అధ్యక్షురాలు మేరుగు లక్ష్మీ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పింగిలి జ్యోతి రెడ్డి, గౌరవ అధ్యక్షురాలిగా సర్వ ఉమా, ఉపాధ్యక్షులుగా మేడిపల్లి రమాదేవి, పర్లపెల్లి శారద, గోపగాని రోజా, ప్రధాన కార్యదర్శురాలిగా అందాస్ రమాదేవి, కోశాధికారిగా కాసగాని శారద, ప్రచార కార్యదర్శులుగా తిప్పని మంగ, మోతుకూరి కొంరమ్మ, బంబర్ల రాజేశ్వరి, కార్యవర్గ సభ్యులు సునీత, తిరుమల, కరుణ, విజయ, సమీరా, వినోద, హేమ, తదితరులను ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షురాలు లక్ష్మి తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ములుగు: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 22న గట్టమ్మ దేవాలయం నుంచి గాంధీ పార్కు వరకు నిర్వహించనున్న రథయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్ ఈయూ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్నవరం రవికాంత్, మంకిడి రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు విద్యుత్, ఆర్అండ్‌బీ, ఎస్పీ, వెటర్నరీ, డీఎంహెచ్ఓ, అగ్నిమాపక, వ్యవసాయ, జెడ్పీ, ఎంపీడీఓ కార్యాలయలతో పాటు ఎమ్మార్సీ, పోలీస్‌స్టేషన్, శిశు సంక్షేమ, ట్రెజరీ, అటవీ శాఖ, బీసీ సంక్షేమ భవన్, జిల్లా అటవీ శాఖ కార్యాలయాల్లో ఉద్యోగులను కలిసి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్రను చేపడుతున్నారని అన్నారు.

ఆర్థిక సాయం

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన ఉట్నూరి యాకమ్మ అనే వితంతు మహిళ ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని దాతల సహాయంతో ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ సభ్యులు ఆమె ఇంటి వద్దకు వెళ్లి గురువారం రూ.10వేలు అందజేశారు. అలాగే నిత్యావసర సరుకులు కూడా బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు సయ్యద్ వహీద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రిటైర్డ్ టీచర్ అనంత లక్ష్మి మాట్లాడుతూ.. ఇలాంటి పేదలను ప్రభుత్వం గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యరమ్రనేని సతీష్, బండపల్లి సంతోష్, వద్ది నరేష్, ఎంపెల్లి నరేష్, మహమ్మద్ అజాహార్ ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే..



మల్హర్: తాడిచర్ల సుంకరిపల్లిలోని బురదమయమైన రోడ్డు



కాటారం: మట్టిరోడ్డుగా మారిన ప్రధాన రహదారి

- బురదమయమైన రోడ్లు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు

మల్హర్: మండలంలోని తాడిచర్ల సుంకరిపల్లి నుంచి ఎస్సీకాలనీ వైపు వెళ్లే మట్టిరోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. ఈ మట్టి రోడ్డుపై ఎస్సీ కాలనీ నుంచి తాడిచర్ల సెంటర్ వైపు నిత్యం రవాణా సాగుతుంది. తాడిచర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతీ రోజు ఆ రోడ్డు వెంటనే వెళ్తుంటారు. ప్రస్తుతం వర్షకాలం కావడంతో వర్షం కురిసినప్పుడల్లా మట్టి రోడ్డు అంతా బురదమయంగా మారుతోంది. విద్యార్థులు పాఠశాలకు బురద రోడ్డపై వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణిస్తున్న క్రమంలో జారీ పడే ప్రమాదం ఉందని వాహనదారులు తెలుపుతున్నారు. గతంలో సుంకరిపల్లి నుంచి అందుగులతండా వరకు రోడ్డు నిర్మాణాం చేపట్టాడానికి పనులకు శంకుస్థాపన చేశారు. నిధుల లేమి కారణంగా పనులు పూర్తి స్థాయిల్లో అమలుకు నోచుకోలేదు. అలాగే రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మరి వాడలోని మట్టి రోడ్డుపై వర్షం కురిసినప్పుడల్లా ఇబ్బందులు పడుతున్నామని పల్లె వాసులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాటారం: గుంతలమయమైన రహదారి

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

కాటారం: కాటారం నుంచి మంథని వైపుగా వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. గతంలో చిన్నపాటి గుంతలతో ఉన్న రహదారి వర్షాలకు ప్రమాదకరంగా మారింది. ధన్వాడ, శంకరాంపల్లి వద్ద రహదారిపై పెద్ద పెద్ద గుంతలు నెలకొనడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసినప్పుడు గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా ధన్వాడ నుంచి శంకరాంపల్లి వరకు పలు చోట్ల రోడ్డు మట్టిరోడ్డు కంటే అధ్వానంగా తయారైంది. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



మల్హర్: బురదమయంగా కుమ్మరిపల్లి రోడ్డు

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కురసం బుచ్చక్క

పలిమెల: భారీ వర్షాలతో వరదలు వచ్చే ప్రమాదం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ కురసం బుచ్చక్క అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖ అధికారులు శాఖా పరమైన నివేదికలు చదివి వినిపించారు. భవిష్యత్‌లో చేపట్టే పనులను గుర్తించి వెల్లడించారు. ఆయా అంశాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించారు. పలు శాఖ అధికారులు హాజరుకాకపోవడంతో వారి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దండెర కల్యాణి, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ నిజాం, ఎంపీడీఓ ప్రకాష్‌రెడ్డి, సర్పంచులు బొచ్చు శ్రీనివాస్, మడే చుక్కమ్మ, చిడం నాగయ్య, ఆలం సత్యనారాయణ, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డుకు మరమ్మతులు



రోడ్డును మరమ్మతు చేయిస్తున్న యువకులు

చిట్యాల: మండలంలోని ఏలేటిరామయ్య–కైలాపూర్ గ్రామాల మధ్య ఉన్న మట్టి రోడ్డు ఇటీవల కురుస్తున్న వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో గ్రామ యువకులు గురువారం మరమ్మతులు చేపట్టారు. రైతులు ప్రమాదాలకు గురవుతున్నారని అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ మేరకు ఏలేటిరామయ్యపల్లి గ్రామానికి చెందిన యువకులు గ్రామస్తుల సహకారంతో రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు ఉండడంతో వాటిని తొలగించారు. అలాగే సొంత ఖర్చులతో గుంతలను పూర్చి అందులో మోరం పోయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు మర్రి నరేష్, కనకుల రమాకాంత్, అన్న శ్రీనువాస్, పోలంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..



పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిట్యాల: పసుపు కుంకుమల కింద ఇచ్చిన భూమి విషయంలో అధికారి పార్టీకి చెందిన జెడ్పీటీసీ గొర్రె సాగర్ బెదిరింపులకు గురి చేస్తుండడంతో కూతురు ఇంటి వద్ద తలదాచుకుంటున్న బాధితురాలికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా వెంకటపురం మండలం ఇంచర్ల గ్రామంలోని కూతురు శ్రీదేవి ఇంటి వద్ద తలదాచుకుంటున్న చిట్యాల మండల చల్లగరిగ గ్రామానికి దుబాసి సరోజనను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పరామర్శించి భరోసా కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జెడ్పీటీసీ సాగర్ పోలీసుల అండదండలతో భూదందాలను కొనసాగిస్తూ పేదప్రజలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జెడ్పీటీసీ, స్థానిక ఎమ్మెల్యేలు చేస్తున్న అరాచాకాలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్తనని తెలిపారు. జెడ్పీటీసీ మాట వినని వారిపై ఎమ్మెల్యే పేరు చెప్పి పోలీసుల చేత కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అక్రమాలపై ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ చిలుకల రాయకొమురు, నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రాజ్‌మహ్మద్

చిట్యాల: ముస్లింల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి హరీష్‌రావుకు రాష్ట్ర మండల కో–ఆప్షన్ ఫోరం అధ్యక్షుడు ఎండీ రాజ్‌మహ్మద్, ప్రధాన కార్యదర్శి ఎండీ మోహిబుద్దీన్‌లు గురువారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో వినతిపత్రం అందజేశారు. వారి వెంట ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ సెల్ చైర్మన్ ఎండీ నయుముద్దీన్, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండీ.రహీం తదితరులు ఉన్నారు.

టార్గెట్‌కు అనుగుణంగా మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

కాటారం: హరితహారం తొమ్మిదవ విడతలో భాగంగా మండలంలో టార్గెట్‌కు అనుగుణంగా మొక్కలు నాటేలా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో హరితహారంపై సమావేశం నిర్వహించారు. గ్రామాల వారిగా టార్గెట్‌ను అనుసరించి నెల చివరి నాటికి మండలం మొత్తం టార్గెట్ ప్రకారం 1,32,840 ఫిల్లింగ్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఓ వెంకన్న, ఎంపీఓ ఉపేంద్రయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మాదారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని మాదారం గ్రామానికి చెందిన గంప రాజు(26) 15రోజుల క్రితం ద్విచక్రవాహనంపై వస్తుండగా కాటారం మండలం చింతకాని గ్రామ సమీపంలో ప్రధాన రహదారి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో రాజుకు తీవ్ర గాయాలు కాగా కుటుంబసభ్యులు వరంగల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'పదిహేను రోజులైనా పట్టింపు లేదు'



చిట్యాల: నిరసన తెలుపుతున్న జీపీ సిబ్బంది



కాటారం: ఆవుకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

చిట్యాల: మండలంలోని పంచాయతీ కార్మికులు పదిహేను రోజులుగా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న కనీసం రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మికుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మ్యాదరి రాజేందర్, జిల్లెల కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అలాగే వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది యుగేందర్, సతీష్, సమ్మక్క, శంకర్, రాజయ్య, కరుణాకర్, మొగిలి, రాకేష్, భాస్కర్, రతన్, రామస్వామి, సారక్క, దేవేందర్‌రెడ్డి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు వినతిపత్రం అందజేత

కాటారం: పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. 15వ రోజులో భాగంగా గురువారం కార్మికులు మండల కేంద్రంలో ఆవుకు వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించకుండా మొద్దు నిద్ర వహిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల జేఏసీ నాయకులు దోమల శ్రీనివాస్, మెండ మల్లేశ్, కొండయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పుల్ల మల్లయ్య

చిట్యాల: పదిహేను రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో జీపీ కార్మికులు లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉంటు రోడ్డుపై నీరు నిలిచి పోతుందని అన్నారు. దీంతో వర్షాకాలంలో దోమలు పెరిగి రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందని వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్ల సతీష్, దబ్బెట రంజిత్, పుల్ల గణేష్, శనిగంటి రంజిత్ పాల్గొన్నారు.

24 గంటల విద్యుత్ సరఫరా బూటకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్హల్‌రావు

మల్హర్: వ్యవసాయానకి 24 గంటల విద్యుత్ సరఫరా బూటకమని ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు ఆరోపించారు. మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులకు వ్యవసాయానికి కనీసం 15 గంటల నిరంతర విద్యుత్ ఇచ్చిన దాఖాలు లేవని విమర్శించారు. మూడు గంటలు కావాలా... 3 పంటలు కావాలా అనే నినాదంతో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని, అసలు ఉత్తర తెలంగాణలో మూడు పంటలు ఎక్కడ సాగవుతున్నాయని ప్రశ్నించారు. రైతులు పండించిన ధాన్యానికి తరుగు పేరిట కొతలు విధిస్తూ, మోసం చేస్తూనే ఉన్నారని వాపోయారు. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీధర్‌బాబు మంత్రిగా ఉన్న సమయంలో మొలకెత్తిన ధాన్యాన్ని సైతం ఎలాంటి కటింగ్ లేకుండా సేకరంచిన సందర్భాంలు ఉన్నాయని గుర్తు చేశారు. రేంవత్‌రెడ్డి మాటలను వక్రీకరించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ ఎత్తి వేస్తుందని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ, దిగజారుడు రాజకీయాలు చేస్తుంన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, నాయకులు తిర్రి సమ్మయ్య, బొబ్బిలి రాజు, ఇందారపు ప్రభాకర్, సమ్మయ్య, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుగా గులాబీ మొక్క..



గులాబీ మొక్క నాటుతున్న ఎస్సై చల్ల రాజు

టేకుమట్ల: శాంతి భద్రతల పరిరక్షణలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలో సైతం ముందుండి తనదైన ముద్రవేసి ప్రత్యేక వ్యక్తిగా గుర్తింపు పొంది, పలువురి మన్ననలు పొందిన వ్యక్తి ఎస్సై చల్ల రాజు. గత సంవత్సరం నవంబర్‌లో టేకుమట్ల ఎస్సైగా బాధ్యతలు చేపట్టి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ సేవలను అందించారు. భూపాలపల్లి వీఆర్‌కు బదిలీపై వెళ్తుడంగా గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గుర్తుగా గులాబీ మొక్కను పోలీస్ సిబ్బందితో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టేకుమట్ల మండల ప్రజలతో తక్కువ సమయంలోనే ప్రత్యేక అనుబంధం ఏర్పడిందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో మండల ప్రజాప్రతినిధులు, మండల ప్రజల సహకారం మరిచిపోలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై ఇంతియాజ్, కానిస్టేబుళ్లు మధూకర్, రంజిత, హర్షితారెడ్డి, స్రవంతి, తదితరులు ఉన్నారు.

దేవరాజ వాహనం అందజేత



వాహనం అందజేస్తున్న మంజుల-రామారావు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని సుప్రసిద్ధ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మండలంలోని గూడెపల్లి గ్రామానికి చెందిన సిరికొండ మంజులా–రామారావు దంపతులు గురువారం దేవరాజ వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్మన్ మాదాడి అనితాకరుణాకర్‌రెడ్డితో పాటు ఆలయ సిబ్బంది వారికి ఆలయంలో ప్రత్యేక అర్చన కార్యక్రమాన్ని చేసి అభినందించారు. ఈ సందర్భంగా మంజులా–రామారావు దంపతులు మాట్లాడుతూ.. తమ ఆరాధ్య దైవమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దేవరాజ వాహనం అందజేయడం అదృష్టంగా భావిస్తున్నామని, స్వామివారి ఆశీస్సులు ప్రతీ ఒక్కరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

రేషన్ కార్డులు మంజూరు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

భూపాలపల్లి అర్బన్: రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి క్యాతరాజు సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు సంవత్సరాల నుంచి రేషన్ కార్డులు మంజూరు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కొత్త రేషన్ కార్డులు లేక పేద ప్రజలు, కొత్తగా పెళ్లయిన వారు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతీ ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి కాబట్టి పేద ప్రజలు అనేక ప్రభుత్వ పథకాలు నష్టపోవడం జరిగిందని అన్నారు. వృద్ధాప్య పింఛన్, వితంతు పెన్షన్, ఒంటరి మహిళా పెన్షన్ ఇవ్వడంలో జాప్యం చేయడం సరైన పద్ధతి కాదన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేముల శ్రీకాంత్, పీక రవి, లోకిని రమేష్, బొల్లపల్లి తిరుపతి, సాబీర్, యాకుబ్, రాజు, రమేష్, రాజమౌళి, అస్లాంలు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి

భూపాలపల్లి పట్టణంలోని సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. హాస్టళ్లలను గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నేరెళ్ల జోసెఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రం ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందినట్లు తెలిపారు. కాస్మోటిక్ చార్జీలు, మెస్ బిల్లులను పెంచాలని కోరారు. హాస్టళ్లకు పక్క భవనాలను నిర్మించాలని, ఖాళీగా ఉన్న కామటి, కుక్, వాచ్‌మెన్, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఒంటెరు రాజేష్, పవన్, సాయి, కళ్యాణ్, రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

మంగపేట: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ మంగపేట వైద్యాధికారి అల్లి నరేష్ అన్నారు. మండల కేంద్రంలోని వరద ముంపు ప్రాంతమైన పొదుమూరులో వైద్యాధికారి ఆధ్వర్యంలో గురువారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ముంపు ప్రాంత ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కలుషిత నీరు తాగొద్దని, నిల్వ ఉంచిన ఆహారాన్ని తీసుకోవద్దని వేడి ఆహారాన్ని తీసుకుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని వడపోసి తాగాలని వివరించారు. దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, విషజ్వరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జయ, అక్బర్‌అబ్బాస్, రవితేజ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీతారామపురంలో వైద్య శిబిరం

వెంకటపురం(కె): మండలం పరిధిలోని సీతారామపురంలో స్థానిక వైద్య సిబ్బంది గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గ్రామంలోని గ్రామస్తులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కాగా, అదే గ్రామంలో అస్వస్థతకు గురై మృతి చెందిన బాధితకుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410